ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
12 జనవరి
2026




# యాదగిరిగుట్టలో భక్తుల కోలాహలం

## ధర్మదర్శనానికి రెండు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం





యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల కోలాహలం నెలకొంది. హైదరాబాద్ సహా రాష్ట్రంలోనిఅబశ్రీశ్రీ పలు ప్రాంతాల నుండి వచ్చిన భక్తులతో.. యాదగిరిగుట్ట ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. అబశ్రీశ్రీకొండ కింద లక్ష్మీపుష్కరిణి, కల్యాణకట్ట, వ్రత మండపం.. కొండపైన బస్ బే, దర్శన, ప్రసాద క్యూలైన్లు, ప్రధానాలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడాయి. రద్దీ కారణంగా స్వామివారి ధర్మదర్శనానికి రెండు గంటలు, స్పెషల్ దర్శనానికి అరగంట సమయం పట్టింది. ఇక భక్తులు జరిపించిన పలు రకాల పూజలు, నిత్య కైంకర్యాల ద్వారా ఆదివారం ఆలయానికి రూ.39,22,539 ఆదాయం వచ్చింది. అత్యధికంగా ప్రసాద విక్రయం ద్వారా రూ.16,1,580, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.6.89 లక్షలు, వీఐపీ దర్శనాల ద్వారా రూ.5.10 లక్షలు, బ్రేక్ దర్శనాలతో రూ.3,15,600 ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

### ఘనంగా నీరాటోత్సవాలు

ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా యాదగిరిగుట్ట నారసింహుడి క్షేత్రంలో గోదాదేవి అమ్మవారికి నీరాటోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఉదయం గోదా అమ్మవారికి ప్రత్యేక సేవను నిర్వహించారు. మొదట అమ్మవారికి నవకలశ తిరుమంజన స్నపనం నిర్వహించి అమ్మవారిని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు.అబశ్రీశ్రీ ఈ సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

# ఉప్పల్ డిపో గౌడ సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ






ఉప్పల్, జనవరి 11 (రోమింగ్ న్యూస్): కౌండిన్య గౌడ సంక్షేమ సంఘం ఉప్పల్ డిపో యూనిట్ ఆధ్వర్యంలో 2026 నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఘనంగా ఆవిష్కరించారు. స్థానిక రంగా నాగభూషణం గౌడ్ నివాసంలో సంఘం అధ్యక్షులు వేముల కేశవ నాథం గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు (పవన్ సాయి హాస్పిటల్) డాక్టర్ ఆలేటి శ్రీనివాస్ గౌడ్, జై గౌడ్ ఉద్యమ ఉపాధ్యక్షులు కొంపల్లి వెంకట్ గౌడ్, ప్రముఖ బిల్డర్ సదానందం గౌడ్ హాజరై క్యాలెండర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కుల బాంధవులందరూ ఐకమత్యంతో ఉంటూ సంక్షేమ ఫలాలను అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రంగా నాగభూషణం గౌడ్, ట్రెజరర్ బత్తుల సత్యనారాయణ గౌడ్, ఉపాధ్యక్షులు కోటి లక్ష్మణ్ గౌడ్, ఉక్కూరి రమేష్ గౌడ్, ప్రచార కార్యదర్శి పల్లె మల్లేశం గౌడ్, సహాయ కార్యదర్శి పప్పుతి బాల్రాజ్ గౌడ్, సభ్యులు వి. భాస్కర్ గౌడ్, ఎం. రమేష్ గౌడ్, పి. విజయ్ కుమార్ గౌడ్, తాళ్లపల్లి అంజయ్య గౌడ్, వేముల రాజు గౌడ్ మరియు సలహాదారులు, సంఘ సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు ఆపన్న హస్తం

### ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: సీఎం రిలీఫ్ ఫండ్ అనేది ఆపదలో ఉన్న పేదప్రజలకు ఆపన్న హస్తం లాంటిదని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. యాదగిరిగుట్టలోని బీర్ల నిలయంలో ఆలేరు నియోజకవర్గ ఎనిమిది మండలాల్లోని లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రిలీఫ్ ఫండ్ అనేది ఒకప్పుడు పైరవీలు, పలుకుబడి కలిగిన నాయకులకు మాత్రమే అందేదని, కానీ ప్రజా ప్రభుత్వం వచ్చాక మారుమూల గ్రామాల నిరుపేదలకు సైతం సీఎంఆర్ఎఫ్ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. అనారోగ్యం కారణంగా చికిత్స కోసం హాస్పిటల్ లో చేరి బిల్లులు చెల్లించే ఆర్థిక స్తోమత లేని నిరుపేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ కొండంత అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఐనాల చైతన్యా మహేందర్ రెడ్డి, తుర్కపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ నాయక్, వర్కింగ్ ప్రెసిడెంట్ చాడ భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వి. హెచ్. పి. జనగామ అధ్యక్షుడిగా అడ్వకేట్ బిక్షపతి



జనగామ, జనవరి 11(రోమింగ్ న్యూస్) విశ్వహిందూ పరిషత్ జనగామ జిల్లా అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది, సమాజ సేవకులు ఎనగందుల బిక్షపతిని నియమిస్తున్నట్లు రాష్ట్ర కార్యవర్గం ప్రకటించింది. పాలమూరులో జరుగుతున్న విశ్వహిందూ పరిషత్ వార్షిక సమావేశాలలో రాష్ట్ర అధ్యక్షుడు భోజనపల్లి నర్సింహ్మా మూర్తి, ప్రధాన కార్యదర్శి పరాయితం లక్ష్మీనారాయణ, క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మల్ల సత్యం జీ మరియు కేంద్ర ప్రాంత అధికారిలు పాల్గొన్న సమావేశంలో ఆదివారం ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ప్రాంత అధ్యక్షులు నర్సింహ్మమూర్తి మాట్లాడుతూ జనగామ జిల్లాలో పరిషత్ హిందువులను సంఘటితం, చైతన్యం చేసే విధంగా కృషిచేయాలని తెలిపారు. కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ధర్మప్రచారం, కార్యక్రమ నిర్వహణలో జనగామ ముందంజలో నిలుస్తున్నదని, మరింత విస్తృత కార్యక్రమ నిర్వహణ, కార్యవర్గ విస్తరణ అవసరమున్నందున, మరింత బలాన్ని ఇచ్చేందుకు సమర్ధవంతమైన అధ్యక్షుడిని నియామకం చేస్తున్నట్లు తెలిపారు. యావత్ జనగామ జిల్లా హిందువులందరూ విశ్వహిందూ పరిషత్ కి చేరువ కావాలని, సమాజ సేవలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వరంగల్ విభాగ్ కార్యదర్శి నందాల చందర్ బాబు, జనగామ జిల్లా నుండి కార్యదర్శి డాక్టర్ మోహనకృష్ణ భార్గవ, సహాకార్యదర్శి చిలువేరు హర్షవర్ధన్, దుర్గా వాహిని కన్వీనర్ బొల్లు ఝాన్సీ, భజరంగ్ దల్ కోకన్వీనర్ సాయితేజ తదితరులు పాల్గొన్నారు, నూతన అధ్యక్షుడు అడ్వకేట్ బిక్షపతికి ఈ సందర్భంగా హిందూ బంధువులు అభినందనలు తెలిపారు.

# కాచారం కైలాస పురం ఆలయానికి రావాలని ప్రముఖులకు ఆహ్వానం

### ఫిబ్రవరి 1న ఆలయ వార్షికోత్సవం







హైదరాబాద్, రోమింగ్ న్యూస్: యాదాద్రి భువనగిరి జిల్లా కాచారం గ్రామంలోని శ్రీ రేణుక వాసవి బసవలింగేశ్వర దేవాలయ 30వ వార్షికోత్సవం ఫిబ్రవరి 1వ తేదీన ఘనంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకను పురస్కరించుకుని దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి హైదరాబాద్‌లోని పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఆహ్వానం అందుకున్న వారిలో ఐవిఎఫ్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పబ్బ చంద్రశేఖర్, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షులు కటకం శ్రీనివాస్ గుప్తా, మరియు సీనియర్ న్యాయవాది రాపోలు భాస్కర్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గత మూడు దశాబ్దాలుగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా నిత్య పూజ కైంకర్యాలు నిర్వహిస్తూ భక్తులకు అమ్మవారి సేవా భాగ్యం కల్పిస్తున్న అంజయ్య స్వామి కృషి అభినందనీయమని కొనియాడారు. ఫిబ్రవరి ఒకటవ తేదీన జరగబోయే ఈ వార్షికోత్సవ వేడుకలకు తాము తప్పక హాజరవుతామని వారు ఈ సందర్భంగా వెల్లడించారు.

# ఎన్నికల నేపథ్యంలో పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలి

### యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్‌కు వినతి

భువనగిరి, జనవరి 10, 2026: యాదాద్రి భువనగిరి జిల్లాలో త్వరలో జరగనున్న మున్సిపల్, జడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ సంఘాల నాయకులు జిల్లా ఎస్పీ ఆకాంక్ష యాదవ్‌ను కోరారు. రాచకొండ కమిషనరేట్ నుండి బదిలీపై వచ్చి జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆమెను నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం ఎన్నికల నిర్వహణపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, సామాజికవేత్త బట్టు రామచంద్రయ్య తదితరులు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో గ్రామాల్లో ప్రజలు భయాందోళనలకు గురికాకుండా ఉండాలంటే నిరంతరం ప్యాట్రోలింగ్ నిర్వహించాలని, సమస్యాత్మక ప్రాంతాల్లో 24 గంటల పోలీస్ పికెట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కుల, రాజకీయ ఆధిపత్యాలతో ఓటర్లను బెదిరించే వారిపై అడ్డుకట్ట వేయాలని, ముఖ్యంగా అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం లేదా కిడ్నాప్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మందు, డబ్బు పంపిణీ వంటి అక్రమాలను అరికట్టి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఎన్నికల్లో పాల్గొనేలా పోలీసు శాఖ భరోసా కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహాలింగం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# యాదగిరిగుట్టలో కాంగ్రెస్, బీజేపీ శ్రేణుల ఘర్షణ

### బీజేపీ నాయకుడికి గాయాలు, నిరసనగా పీఎస్ ఎదుట బీజేపీ ధర్నా

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదాద్రి జిల్లా యాదగిరిగుట్టలో ఓ స్థలం విషయం కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. వివరాల్లోకి వెళ్తే.. యాదగిరిగుట్టలో ఓ స్థలం విషయంలో గత కొన్ని రోజులుగా ఓ కాంగ్రెస్ నాయకుడికి, ఓ రియల్టర్ కు ఇష్యూ కొనసాగుతోంది. ఈ క్రమంలో సదరు రియల్టర్ కోర్టు ఆర్డర్ కాపీతో స్థానిక బీజేపీ నాయకుడితో కలిసి ఆదివారం సాయంత్రం యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్ కు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న సదరు కాంగ్రెస్ నాయకుడు పోలీస్ స్టేషన్ కు రాగా.. పీఎస్ లోనే సదరు బీజేపీ, కాంగ్రెస్ నాయకులు గొడవకు దిగారు. పోలీసులు కలుగజేసుకుని సర్ధిచెప్పారు. అనంతరం బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పీఎస్ నుండి బయటకు వెళ్లి పోయారు. బీజేపీ నాయకులు తిరిగి ఇంటికి వెళ్తున్న క్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడి తమ్ముడిని కొందరు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడి వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. ఈ క్రమంలో అతని ముక్కుకు గాయం కావడంతో.. బీజేపీ నాయకులు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. దాడికి పాల్పడిన కాంగ్రెస్ నాయకులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు. పరిస్థితి అదుపుతప్పుతుండడంతో.. పోలీసులు జోక్యం చేసుకుని ధర్నాను భగ్నం చేశారు. తనకు సంబంధం లేని విషయంలో సదరు బీజేపీ నాయకుడు కొంతకాలంగా తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి నిరాధారమైన ఆరోపణలు చేస్తూ తన పరువుకు భగ్నం కలిగిస్తున్నాడని సదరు కాంగ్రెస్ నాయకుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. తన తమ్ముడిని కొట్టిన కాంగ్రెస్ నాయకులపై వెంటనే కేసు నమోదు చేయాలని సదరు బీజేపీ పట్టణ అధ్యక్షుడు పోలీసులకు కంప్లైంట్ చేశారు. విచారణ జరిపి ఇరువర్గాలపై కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

